సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 18 । సెప్టెంబర్ । 2025



నెట్‌వర్క్ లేదు..

గిరిశిఖర ప్రాంతాలను సెల్‌ఫోన్ సిగ్నల్స్ సమస్య వేధిస్తోంది. నెట్‌వర్క్ అందక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో



ఎట్టకేలకు..!

ఐటీఐలో ఖాళీ సీట్ల భర్తీకి ఎట్టకేలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 27 తేదీని దరఖాస్తు గడువుగా విధించింది.

- 8లో

21న జెడ్పీ సర్వసభ్య సమావేశం

అరసవల్లి: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాకు చెందిన అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

న్యూస్‌రీల్

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల్లో మిగులు సీట్లలో ప్రవేశాలకు ఈ నెల 23లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.బేతనసామి బుధవారం పేర్కొన్నారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 9వ తరగతిలోకి, టెన్త్ విద్యార్థులు 11వ తరగతిలో ప్రవేశానికి అర్హులని తెలిపారు.

19న 'చలో మెడికల్ కాలేజ్'



మాట్లాడుతున్న ఎం.వి.స్వరూప్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుడితే అందులో 12 కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తులకు అమ్మేసే ప్రయత్నం విరమించాలని కోరుతూ ఈ నెల 19న చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వి. స్వరూప్ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రయివేటు నివాసగృహంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 19న పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో శాంతియుతంగా పెద్ద ఎత్తున నిరసన తెలియజేస్తామని పేర్కొన్నారు. జిల్లా నుంచి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పేదలను దృష్టిలో పెట్టుకుని వైఎస్ జగన్ మెడికల్ కాలేజీల ఏర్పాటు చేస్తే.. డబ్బులు లేవనే నెపంతో సీఎం చంద్రబాబు ప్రయివేటు వ్యక్తులకు అప్పగించడం సరికాదన్నారు యువ జన విభాగం జిల్లా అధ్యక్షుడు మార్పు పృథ్వీ, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్తా విజయ్, భరద్వాజ్, గుండ హరీష్, ఇషాక్, సుంకరి పవన్, భరత్, వెంకన్న, నాగేష్, శ్రీను, రాకేష్, శేఖర్ పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వర్సిటీ ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ ఉదయభాస్కరరావు బుధవారం విడుదల చేశారు. ఐదు బ్రాంచ్‌లలో 289 మంది పరీక్షలకు హాజరుకాగా 270 మంది ఉత్తీర్ణులయ్యారు. ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సు పదో సెమిస్టర్‌లో 24 మంది, మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సు ఆరో సెమిస్టర్‌లో 92 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను జ్ఞానభూమి పోర్టల్, వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

'సాక్షి'పై అంత అక్కసు ఎందుకో..



ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా పిలిచే మీడియా వ్యవస్థపై అక్రమ కేసులు పెట్టడం సిగ్గు చేటు. కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పుల్ని మోసాల్ని వెలుగులోకి తీసుకొస్తుందన్న అక్కసుతోనే 'సాక్షి' పత్రికను ఇబ్బంది పెట్టేందుకు దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డితో పాటు విలేకరులపై అక్రమ కేసులు బనాయించారు.

– అంబటి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పోలినాటి వెలమ సామాజిక విభాగం అధ్యక్షుడు



వేధింపులను ఖండిస్తున్నాం



కోట్లాది ప్రజల గొంతుకగా నిలిచే మీడియాను అణచివేయడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ. ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నించిన సాక్షి పత్రికా విలేకర్లను వేధించడం హేయమైన చర్య. ప్రతిపక్షం చేసే విమర్శలకు సమాధానం చెప్పడం చేతకాక అధికార దుర్వినియోగానికి పాల్పడటం గర్హనీయం.

– అంధవరపు సూరిబాబు, వైఎస్సార్ సీపీ కళింగవైశ్య కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు

ఎవరు అధ్యక్షా?



- టీడీపీలో వీడని అధ్యక్ష పీఠముడి
- ఆ పదవిలో ఉండలేనని చెప్పేసిన కలమట
- అధికారిక పదవి ఇవ్వాలని డిమాండ్
- పదవిపై ఆసక్తి చూపని ఎమ్మెల్యేలు
- తెరపైకి నలుగురు నేతలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్ష పదవిపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. వెలమ సామాజిక వర్గానికి ఇప్పటికే రెండు కీలక మంత్రి పదవులు ఉండటంతో కాళింగ, కాపుల మధ్య అధ్యక్ష పదవి దోబూచులాడుతోంది. ఇప్పుడా పదవిని నలుగురు ఆశిస్తున్నారు. వారిలో ఒక్కొక్కరికీ ఒక్కో నేత అండగా నిలుస్తున్నారు. దీంతో ఏకాభిప్రాయం కుదరడం లేదు. సమీకరణాలు, సంప్రదింపులు, చర్చలు, అభిప్రాయ సేకరణ జరిగినా అధ్యక్ష ఎంపిక కొలిక్కిరాలేదు. చివరికి ఎంపిక బాధ్యతను అధిష్టానానికే అప్పగించేశారు.

హామీ నెరవేర్చాల్సిందే..

టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ప్రస్తుతం కలమట వెంకటరమణ కొనసాగుతున్నారు. అధికారంలోకి రావడంతో అధ్యక్ష పదవిపై ఆయనకు మోజు తగ్గిపోయింది. ప్రభుత్వం ఉన్నప్పుడే ఏదో ఒక పదవి దక్కించుకోవాలని చూస్తున్నారు. ఎన్నికలకు ముందు టికెట్ ఇవ్వనప్పుడు ఎమ్మెల్సీ ఇస్తామని ఆఫర్ చేసినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. అది కాకపోతే మరో కీలక పదవి వస్తుందని పార్టీ వేగుల ద్వారా బుజ్జగించిన దాఖలాలు ఉన్నాయి. ఆ కారణం చేతనే జిల్లా అధ్యక్షుడిగా కొనసాగేందుకు కలమట ఇష్టపడటం లేదు. ఈ సమయంలో ఎమ్మెల్యేలుగా ఉన్న వారికి అధ్యక్ష పదవి ఇస్తే ఎలా ఉంటుందని ఆలోచన చేశారు. గతంలో చేసిన గౌతు శిరీష, కూన రవికుమార్ కాకుండా కొత్తగా ఎన్నికైన గొండు శంకర్, మామిడి గోవిందరావులలో ఎవరో ఒకరికి ఇస్తే ఎలా ఉంటుందని సమాలోచన చేశారు. కానీ, వారు ఆసక్తి చూపలేదని తెలిసింది.

ఎవరికి దక్కేనో..

ఈ నేపథ్యంలో కొన్ని పేర్లు ప్రతిపాదనకు వచ్చాయి. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పదవిలో ఉన్న బూర్జ మండలానికి చెందిన ఆనెపు రామకృష్ణ నాయుడు, ఆమదాలవలసకు మొదలవలస రమేష్, ఎచ్చెర్లకు చెందిన చౌదరి నారాయణమూర్తి(బాబ్జీ), పలాసకు చెందిన పీరుకట్ల విఠల్ రేసులోకి వచ్చారు. ఇందులో రామకృష్ణ, విఠల్ కాపు సామాజిక వర్గం కాగా, రమేష్, బాబ్జీ కాళింగ సామాజిక వర్గం. వీరిలో ఎవరిని ఎంపిక చేయాలన్న దానిపై అధిష్టానం ఏకాభిప్రాయానికి రాలేకపోతోంది. రామకృష్ణకు ఇస్తే భవిష్యత్‌లో ఎక్కడ పోటీ పడతారోనన్న భయం కూన రవికుమార్‌లో ఉందన్న వాదనలు ఉన్నాయి. అందుకే రామకృష్ణకు పూర్తి స్థాయిలో సహకరించడం లేదని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అదే సమయంలో తనకు బంధువైన రమేష్‌ను ప్రోత్సహిస్తున్నట్టు కూడా తెలుస్తోంది. బంధువుకిస్తే ఎటువంటి ఇబ్బందులుండవని ఆయన భావిస్తున్నట్టు సమాచారం. ఇదే, సమయంలో పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు బాబ్జీ పేరు కూడా ప్రతిపాదన వచ్చినా ఆయనపై అనేక అభ్యంతరాలు ఉన్నాయి. ఎచ్చెర్ల నియోజకవర్గం విజయనగరం పార్లమెంట్ పరిధిలోకి వస్తుందని, ఆ పార్లమెంట్‌కు చెందిన వ్యక్తిని ఇక్కడ అధ్యక్షుడిగా నియమించడం సరికాదని ఓ వర్గం అభ్యంతరం తెలిపినట్టు సమాచారం. వారి కుమారుడికి డీసీఎంఎస్ ఛైర్మన్ పదవి కూడా ఇవ్వడంతో అధ్యక్ష పదవి విషయంలో ఆయనను పరిగణనలోకి తీసుకోవడం సరికాదంటూ వ్యతిరేకిస్తున్నట్టు తెలిసింది. ఇక, కాపు సామాజిక వర్గానికి చెందిన పీరుకట్ల విఠల్ పూర్తిగా గౌతు శ్యామ్ సుందర్ శివాజీ ఫ్యామిలీపై ఆధారపడి ఆశిస్తున్నారు.

వ్యూహాత్మకంగా బాబాయ్..అబ్బాయ్..

ఈ మొత్తం ఎపిసోడ్‌లో బాబాయ్, అబ్బాయ్‌లు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. కర్ర విరగకూడదు.. పాము చావకూడదు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. బయటకు చెప్పకుండా ఎవరికివ్వాల్సిన మద్దతు వారికి ఇస్తున్నారు. కానీ, జిల్లాలో తనకు రాజకీయ అంతర్గత ప్రత్యర్థి అయిన ప్రజాప్రతినిధి మాత్రం పావులు కదుపుతున్నారు. ఆయన చెప్పిన వ్యక్తికి ఇస్తే పార్టీపై పట్టు సాధిస్తారని, పరోక్షంగా ఇబ్బంది వస్తుందని వ్యూహాత్మకంగా వెళ్తున్నారు. కలిసిన వారందరికీ ఆశీస్సులు ఉంటాయని చెబుతూ.. నీకెందుకు అధిష్టానం స్థాయిలో చూసుకుంటానని భరోసా ఇస్తున్నారు. దీంతో ఎవరికి వారే తమకే అధ్యక్ష పదవి వస్తుందని ఆశలు పెట్టుకున్నారు. మొత్తానికి జిల్లా స్థాయిలో ఏకాభిప్రాయం కుదరడం లేదు. అధిష్టానం వద్ద ఎవరు పట్టు సాధిస్తారో వేచి చూడాలి.

● విశ్వకర్మకు విశేష పూజలు



దైవిక వాస్తు శిల్పి విశ్వకర్మ జయంతి జిల్లావ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. నందిగాంలోని వీరబ్రహ్మేంద్రస్వామి మందిరం ఆవరణలో విశ్వకర్మ విగ్రహాన్ని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు మేడేపల్లి రమేష్ శర్మ, విశ్వబ్రాహ్మణులు, పరిసర గ్రామాల భక్తులు, చేతివృత్తిదారులు పాల్గొన్నారు.

– నందిగాం

కొనసాగుతున్న యూరియా కష్టాలు

పాతపట్నం/కంచిలి: యూరియా కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. బుధవారం పాతపట్నం మండల కేంద్రంలోని ఇద్దరు ప్రైవేటు డీలర్లకు యూరియా వచ్చిందని తెలియడంతో ఒక్కసారిగా రైతులు చేరుకుని బారులు తీరారు. 1,100 (50 మెట్రిక్ టన్నులు) యూరియా బస్తాలు వచ్చాయని, టోకెన్ ద్వారా యూరియా అందజేస్తున్నామని ఏఓ పి.కిరణ్‌వాణి, ఏఈఓ టి.భారతి తెలిపారు. మరోవైపు, ఎరువులకు సంబంధించిన టోకెన్ల కోసం రైతులకు పాట్లు తప్పడం లేదు. కంచిలి మండలం జలంత్రకోట గ్రామ సచివాలయం వద్ద బుధవారం టోకెన్ల కోసం రైతులు ఎగబడ్డారు. ఇక్కడ ఎరువులు రాకుండానే, ముందస్తుగా టోకెన్లు పంపిణీ చేస్తుండటం గమనార్హం.



పాతపట్నంలో ఎరువుల దుకాణం వద్ద బారులు తీరిన రైతులు

నాలుగు బార్లకే దరఖాస్తులు



శ్రీకాకుళం క్రైమ్ : రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు జిల్లాలో రెండోసారి బార్ల నోటిఫికేషన్‌ను ఎక్సైజ్ శాఖ విడుదల చేసిన సంగతి తెలిసిందే. బుధవారం రాత్రి 10 గంటలకు దరఖాస్తులు స్వీకరణ గడువు ముగిసేసరికి మొత్తం 14 బార్లకు గాను నాలుగే డ్రాలో పాల్గొనేందుకు అర్హత సాధించాయి. శ్రీకాకుళం కార్పొరేషన్‌లో 3, ఆమదాలవలసలో ఒక బారుకు కలిపి 17 దరఖాస్తులు వచ్చాయి. గురువారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ డ్రా తీస్తారని అధికారులు పేర్కొన్నారు.



బందపల్లిలో పర్యటిస్తున్న నేషనల్ అబ్జర్వర్ రాహుల్ పురాణా

గిరిజనుల సమస్యలపై ఆరా

మెళియాపుట్టి : గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని జాతీయ పరిశీలకుడు రాహుల్ పురాణా అన్నారు. బుధవారం బందపల్లిలో పర్యటించి గృహ నిర్మాణాలు, గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆది కర్మ యోగి కార్యక్రమం ద్వారా తొలి విడతగా 34 గ్రామాలు ఎంపికచేసి అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పాపారావు, డిప్యూటీ ఎంపీడీఓ తారకేశ్వరి, సర్పంచ్ బెజ్జి సరోజిని, జెడ్పీటీసీ గూడ ఎండయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలన ▸ దాడులే దళితులకు నజరానా

బాబును గద్దె దించడమే దళితుల లక్ష్యం

- వైఎస్ జగన్ గెలుపుకోసం సైనికుల్లా పనిచేద్దాం: వైఎస్సార్‌సీపీ దళిత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు టి.జె.ఆర్.సుధాకర్‌బాబు
- వైఎస్సార్ సీపీ పాలనలోనే దళితులకు సంపూర్ణ న్యాయం: మాజీ డిప్యూటీ సీఎం కృష్ణదాస్
- దళితులను ఎమ్మెల్సీ చేసేందుకు కృషి: మాజీ మంత్రి ధర్మాన
- ఆధునిక అంబేద్కర్ జగన్: మాజీ మంత్రి సీదిరి
- దోపిడీకి స్వస్తి చెప్పాలి: మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం
- వైఎస్సార్‌సీపీ దళిత విభాగం విస్తృత స్థాయి సమావేశానికి భారీగా హాజరు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు టి.జె.ఆర్.సుధాకర్‌బాబు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

దళితులకు పూర్తిస్థాయిలో సంక్షేమ ఫలాలు అందించిన నాయకుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని, దళిత కులానికి చెందిన ఏ ఒక్కరిని తట్టినా అంబేద్కర్, జగన్‌మోహన్‌రెడ్డిల పేరే వినిపించాలని వైఎస్సార్ సీపీ దళిత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు టి.జె.ఆర్.సుధాకర్‌బాబు అన్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా దళితులపై దాడులు, అరాచకాలు, అకృత్యాలు, వేధింపులు చేస్తునే ఉంటారని, అటువంటి వ్యక్తిని గద్దె దించేవరకు యావత్తు దళిత జాతి నిద్రపోకూడదని పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ దళిత విభాగం విస్తృత స్థాయి సమావేశం ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్, వైఎస్సార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి మాట్లాడుతూ దళితులను నా చెల్లి.. నా అక్క .. నా అన్న అని అక్కున చేర్చుకున్న వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. కూటమి పాలన వచ్చాక రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుచేసి దళితుల్ని పట్టిపీడిస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్క దళితుడిపైనా దాడులు జరగడం గానీ, వేధింపులు గానీ లేవన్నారు. దళితులంతా ఏకమై కూటమి నేతల మెడలు వంచాలని పిలుపునిచ్చారు.

● వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నాడ రుషి మాట్లాడుతూ దళితుల కోసం నిరంతరం ఆలోచన చేసే మొదటి వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అయితే రెండో వ్యక్తి ధర్మాన ప్రసాదరావు అని అన్నారు. పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య, కొరపాన కళ్యాణి అనే ఉద్యోగినులపై మంత్రి అచ్చెన్న, కూన రవికుమార్‌ల వేధింపులను దళిత జాతి మరిచిపోదన్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ఒక్క అభివృద్ధి పనైనా చేశారా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేద్దామన్నారు.

● వైఎస్సార్‌సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.కనకారావు మాట్లాడుతూ రాష్ట్రంలో భారత రాజ్యాంగం అమలుచేయకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుచేయడం దారుణమన్నారు. దళితుల క్షేమం కోసం పరితపించే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపుకోసం కృషి చేయాలన్నారు.

సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ విభాగం విజయనగరం జిల్లా అధ్యక్షుడు జైహింద్‌కుమార్, విశాఖపట్నం అధ్యక్షుడు శివరామకృష్ణ, శ్రీకాకుళం నియోజకవర్గ అధ్యక్షుడు యజ్జల గురుమూర్తి, నాయకులు కల్లేపల్లి లక్ష్మణరావు, జీవన్, జడ్యాడ జయరావ్, వావిలాపల్లి శ్రీనివాసరావు, అలికాన మాధవరావు, నేతల కృష్ణ, కల్లేపల్లి రాంగోపాల్, గుజ్జల యోగేశ్వరరావు, బుడారి లక్ష్మణరావు, పెయ్యిల లక్ష్మణరావు, చల్ల దేవరాజు, లాయర్ శ్యామ్, సతివాడ రామినాయుడు, కుర్మాన బాలకృష్ణ, ఆట్ల సరోజనమ్మ, టొంపల సీతారాం, యడ్ల ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు ముఖ్య నాయకులు ఎం.వి పద్మావతి, ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, తమ్మినేని చిరంజీవినాగ్, మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, దుంపల లక్ష్మణరావు, అంబటి శ్రీనివాసరావు, ఎం.వి.స్వరూప్, గొండు రఘురాం, చింతాడ రామ్మోహన్‌రావు, గద్దిబోయిన కృష్ణయాదవ్, రౌతు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం.. మన దౌర్భాగ్యం..

మనిషిగా పుట్టాలనుకునేవాడెవ్వడైనా దళితుడుగా పుడతాడా అన్న చంద్రబాబులాంటి నీచుడు రాష్ట్రంలో సీఎంగా ఉండటం మన దౌర్భాగ్యం. ఉచిత బస్సు పథకం, పింఛన్ పెంపు వంటి పథకాల వల్ల దళితులకు ఏ మాత్రం ఉపయోగం లేదు. దళితుల కోసం రూ.50వేల కోట్లు ఖర్చుచేసింది జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే. నాడు-నేడు కింద పాఠశాలలను అభివృద్ధి చేసింది బడుగు, బలహీనవర్గాల కోసమేనన్న సంగతి మనమంతా గుర్తుంచుకోవాలి. కేంద్ర, రాష్ట్ర మంత్రులున్న శ్రీకాకుళం జిల్లాలో దళితుల కోసం ఒక్క మంచి కార్యక్రమమైనా చేశారా? కేంద్ర మంత్రి ఢిల్లీలో, రాష్ట్ర మంత్రి అచ్చెన్న అమరావతిలో ఉంటారు. అదే వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉంటే అర్ధరాత్రి సైతం ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్, అప్పలరాజు, సీతారాంలు అందుబాటులో ఉంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు పెరిగిపోయాయి. 2029 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయడమే మనందరి లక్ష్యం.

– టి.జె.ఆర్.సుధాకర్‌బాబు, వైఎస్సార్ సీపీ దళిత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు

పరిపాలనాదక్షుడిని వదులుకున్నాం..



దేశ చరిత్రలో ఎవ్వరు చేయలేని పథకాలను అమలు చేసిన సుపరిపాలన అందించిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి. అటువంటి వైఎస్సార్‌సీపీని అనవసరంగా వదులుకున్నామని ఎంతోమంది నిరుపేదలు బాధపడుతున్నారు. రైతుకు ఎరువు, విత్తనాలు, పురుగుమందులు ఇవేవీ సమయానికి దొరకడం లేదు. దొరికినా వ్యయప్రయాసలకు ఓర్చి గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి. రేషన్ ఇంటివద్దకే వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. దళిత జాతి మొత్తం జగన్‌కు అండగా నిలవాలి.

– తమ్మినేని సీతారాం, మాజీ స్పీకర్

దళిత ద్రోహి చంద్రబాబు



తాత్కాలిక ప్రలోభాలకు లోనుకాకుండా దళితుల జీవితాల్లో వెలుగులు నింపే నాయకుడికే పట్టం కట్టాలి. దళితులకు జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రాధాన్యత ఇప్పటివరకు ఏ రాజకీయ పార్టీ ఇవ్వలేదు. దళిత కులానికి చెందిన నారాయణస్వామిని డిప్యూటీ సీఎంగా చేసిన ఘనత జగనన్నది. ఎన్నికల హామీలు అమలు చేయకపోతే చంద్రబాబు దళిత ద్రోహిగా చరిత్రలో నిలిచిపోతారు.

– ధర్మాన కృష్ణదాస్, మాజీ డిప్యూటీ సీఎం, పార్టీ జిల్లా అధ్యక్షుడు

ఎమ్మెల్సీ చేసేందుకు కృషి



జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో దళితులున్నప్పటికీ ఎమ్మెల్యే సీటును గెలిపించుకునేంత సంఖ్యా బలం లేకపోవడం వల్లే ఎమ్మెల్యే సీటు దక్కడం లేదు. ఈసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించేందుకు కృషి చేస్తా. రాష్ట్రంలో టీడీపీ పాలనే సాగుతోంది తప్ప కూటమి పాలన కాదు. బీజేపీ, జనసేనల్ని గెలుపుకోసం వాడుకున్నారు. అమరావతిలో వరదకు పడవలు వేస్తే వాటిని మీడియాలో ప్రచారం కాకుండా ఆంక్షలు పెట్టడం దారుణం. దళితులపై అక్రమ కేసులు పెట్టి టీడీపీ నేతలు చుట్టూ తిప్పించుకుని మళ్లీ ఓట్లు వేయించాలని చూస్తున్నారు.

– ధర్మాన ప్రసాదరావు, మాజీ మంత్రి

వైఎస్సార్‌సీపీ హయాంలోనే లబ్ధి



వైఎస్సార్‌సీపీ హయాంలో విద్య, వైద్యం, సంక్షేమ పథకాలతో దళితులకు ఎంతగానో లబ్ధి చేకూరింది. కార్పొరేట్ వ్యక్తులకు మాత్రమే ప్రాధాన్యమిస్తారు.

– చింతాడ రవికుమార్, వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస సమన్వయకర్త

ప్రశ్నించకపోతే మనల్నీ అమ్మేస్తాడు..



ఆధునిక యుగంలో అంబేడ్కర్ ఆలోచనలు అమలుచేసిన పార్టీ వైఎస్సార్‌సీపీయే. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే అందులో 12 ప్రైవేటుపరం చేయాలని చంద్రబాబు చూస్తున్నాడు. అమరావతిలో ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.2500 కోట్లు ఖర్చుచేయడం అవసరమా? అదేదో మెడికల్ కాలేజీల నిర్మాణానికి ఖర్చు చేస్తే బాగుంటుంది కదా. దీనిపై ప్రతి ఒక్కరూ ఉద్యమించాలి. ప్రశ్నించకుంటే మనందరినీ అమ్మేస్తాడు. మన సొత్తుని మనమే కాపాడుకోవాలి. దళితులంతా ఏకతాటిపైకి వచ్చి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని తీసుకురావాలని కోరారు.– డాక్టర్ సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి

భరోసాగా ఉంటాం..



చంద్రబాబు బూటకపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక దళితుల్ని విస్మరించారన్న విషయం మీరంతా గుర్తుపెట్టుకోవాలి. విభజించి పాలించడం చంద్రబాబుకి వెన్నతోపెట్టిన విద్య. దళితులకు ఏ కష్టం ఉన్నా నిరంతరం మీ వెంటే ఉండే పార్టీ వైఎస్సార్ సీపీ.

–గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే

కూటమిలో ప్రాధాన్యత ఏదీ?



దళితుల వెంటే ఉంటామని వేదికలపై చెప్పడం కాదు. గుండెల్లో పెట్టుకుని ప్రతిక్షణం ఆలోచన చేసి సంక్షేమ పథకాలు అందించే నాయకుడు కావాలి. కూటమి ప్రభుత్వంలో దళితుల్ని పూర్తిగా విస్మరిస్తున్నారు. నామినేటెడ్ పదవుల్లో సైతం ప్రాధాన్యత కల్పించకపోవడం అన్యాయం.

– రెడ్డి శాంతి, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే

నెట్‌వర్క్ లేదు.. సమాచారం రాదు..!

- వేధిస్తున్న సెల్‌ఫోన్ సిగ్నల్స్ సమస్య
- గిరిజనులకు తప్పని నెట్‌వర్క్ పాట్లు
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు



కేరాసింగి కొండపై నిర్మించిన టవర్



సిగ్నల్స్ అందని కేరాసింగ్ గ్రామం

మెళియాపుట్టి: మారుమూల గిరిశిఖరాగ్ర గ్రామాలకు నేటికీ పూర్తిస్థాయిలో సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఉండడం లేదు. దీంతో అత్యవసర సమయాల్లో వారికి ఎటువంటి సమాచారం అందాలన్నా.. ఇవ్వాలన్నా కష్టమవుతోంది. అలాగే రేషన్, పింఛన్ వంటి పథకాలు అందజేసేటప్పుడు సిగ్నల్స్ సమయానికి రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా పాతపట్నం నియోజకవర్గంలోని మెళియాపుట్టి, కొత్తూరు మండలాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్స్ అందుబాటులో లేని గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి. గ్రామాల్లోకి సిగ్నల్స్ రాకపోవడంతో గిరిజనులు కొండలు, గుట్టలు ఎక్కాల్సి వస్తోంది. అత్యవసర సమయాల్లో కిలోమీటర్ల మేర నడిచి సిగ్నల్స్ ఉన్నచోటికి చేరుకుంటున్నారు. ఈ సమస్య దీర్ఘకాలికంగా వేధిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో మెళియాపుట్టి మండలంలో 18 టవర్లు, కొత్తూరులో 8 టవర్లను నిర్మించారు. కొన్ని ప్రారంభమయ్యాయి. అయితే ప్రారంభమైన టవర్ల నుంచి కూడా సరిగా సిగ్నల్స్ రావడం లేదని గిరిజనులు వాపోతున్నారు. 4జీ, 5జీ ఫోన్లు ఉంటేనే సిగ్నల్స్ వస్తున్నట్లు చెబుతున్నారు. టవర్లు నిర్మించి వాటికి సంబంధించిన సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటులో అధికారులు విఫలమయ్యారని కేరాసింగి, గూడ, చందనగిరి, హడ్డివాడ, దీనబంధుపురం తదితర గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెళియాపుట్టి మండలంలో అయితే మండల కేంద్రానికి నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉన్న దీనబంధుపురం, కుద్దబ, గేదెల పోలూరు, చింతలపోలూరు అలాగే రామచంద్రాపురం, కొత్తూరు తదితర గ్రామాలకు సైతం నెట్‌వర్క్ పూర్తిస్థాయిలో రావడం లేదు. ఉత్తరాంధ్రలోనే ఎత్తైన గిరి శిఖర గ్రామాలైన చందనగిరి, గూడ, కేరాసింగి ప్రజల పరిస్థితి మరీ దారుణంగా ఉంది.



కుద్దబ గ్రామంలో సిగ్నల్ కోసం ప్లాస్టిక్ బాటిల్‌లో వేలాడదీసిన ఫోన్ చూపిస్తున్న గ్రామస్తుడు



చందనగిరి గ్రామంలో సిగ్నల్ రాకపోవడంతో ఇంటి పైకప్పుకు వేలాడదీసిన సెల్‌ఫోన్

టవర్ నిర్మించినా ఇబ్బందులు



మా గ్రామానికి నెట్‌వర్క్ రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. టవర్లు నిర్మించారు కానీ ఫలితం లేదు. అత్యవసర సమయాల్లో మాకు ఏ సమాచారం అందదు. గ్రామానికి వెళ్లిపోతే మాకు బాహ్య ప్రపంచంతో బంధం తెగిపోయినట్లే. ఇలా చాలా ఏళ్లుగా భరిస్తున్నాం.

– సవర తేజేశ్వరరావు, గేదెల పోలూరు, మెళియాపుట్టి మండలం

బాహ్య ప్రపంచానికి దూరం



సెల్‌ఫోన్ సిగ్నల్స్ మాకు చాలా అవసరం. కానీ 4జీ, 5జీ నెట్‌వర్క్ ఉన్నటువంటి ఫోన్లకే వస్తాయి. మా గిరిజనులు అందరూ అటువంటి ఫోన్లు వాడలేరు. అత్యవసర సమయాల్లో ఫోన్లు పనిచేయక ఇబ్బందులు పడుతున్నాం. మా గ్రామాలు కొండలపై ఉన్నాయి. సిగ్నల్స్ లేకపోవడంతో బాహ్య ప్రపంచానికి దూరంగా బతుకుతున్నాం.

– చందనగిరి పోలయ్య, హడ్డివాడ, మెళియాపుట్టి

సమస్య పరిష్కరిస్తాం

మెళియాపుట్టి మండలంలో చాలావరకు టవర్లు ప్రారంభించాం. అయితే 4జీ, 5జీ ఫోన్లలో సిగ్నల్ వస్తుంది. దీనబంధుపురంలో టవర్ ప్రారంభించాం.. సిగ్నల్ కొంచెం డవలప్ కావాలి. త్వరలోనే కేరాసింగి కొండపై ఉన్న టవర్ కూడా పూర్తిస్థాయిలో పనిచేసేలా చూస్తాం. మా పరిధిలో మేముకూడా పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. కొన్నిచోట్ల కరెంటు లేకపోతే సిగ్నల్ రావడం లేదని తెలుసుకుని బ్యాటరీలు అమర్చాం. త్వరలోనే సిగ్నల్ వ్యవస్థ మెరుగుపడుతుంది.

– బి.పవన్, బీఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఇంజినీర్, పాతపట్నం

• మర్యాదపూర్వక భేటీ



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ, ఆమె భర్త, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్‌లు తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై చర్చించినట్లు తెలిపారు.

– కంచిలి

• రామకృష్ణకు స్టెవీ అవార్డు



అవార్డుతో రామకృష్ణ

జలుమూరు: మండలంలోని యలమంచిలి గ్రామానికి చెందిన మెండ రామకృష్ణకు అత్యున్నత స్టెవీ అవార్డు వరించింది. అమెరికా దేశం న్యూయార్క్‌లో రామకృష్ణకు ఈ అవార్డు ప్రదానం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీలు, సేవారంగ సంస్థలు, అంతర్జాతీయ వ్యాపార రంగ దిగ్గజాలు, కస్టమర్ సర్వీసు కేంద్రాలు, టెక్నాలజీ సంస్థలు, మార్కెటింగ్ నిపుణులు తదితర రంగాల్లో విభిన్న ప్రతిభ చూపినవారికి సుమారు 200 మంది వరకు జడ్జీలు నిర్ణయించి అవార్డుకు ఎంపిక చేస్తారు. రామకృష్ణ టెక్నాలజీ రంగంలో చేసిన కృషికి గాను ఈ అవార్డు వచ్చినట్లు తెలిపారు. ఆయన గత 20 ఏళ్లుగా అమెరికాలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఆయనకు మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, పద్మప్రియ, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎంపీపీ గోపి తదితరులు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



ఈశ్వరరావు మృతదేహం

సోంపేట: మండలంలోని పాలవలస గ్రామానికి చెందిన రైతు పీతాంబరం ఈశ్వరరావు(45) విద్యుత్ షాక్‌తో బుధవారం సాయంత్రం మృతి చెందాడు. బారువ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఈశ్వరరావుకు వ్యవసాయం మీద మక్కువ ఎక్కువ. దీనిలో భాగంగానే బుధవారం సాయంత్రం ఎప్పటిలాగే తన విద్యుత్ మోటారు ఆన్ చేయడానికి వెళ్లగా విద్యుత్ షాక్ కొట్టడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య ఉషారాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీఐ బి.మంగరాజు, విద్యుత్ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై ఆటో డ్రైవర్ దాడి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని బలగ కూడలి వద్ద ఆర్టీసీ బస్ డ్రైవర్‌పై ఒక ఆటో డ్రైవర్ దాడికి పాల్పడినట్లు రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు బుధవారం తెలియజేశారు. బలగకు చెందిన చిట్టి రాజు ఆర్టీసీలో ఒప్పంద ఉద్యోగిగా కొనసాగుతున్నాడు. ఈ క్రమంలో శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి బుధవారం బత్తిలి వెళ్లేందుకు బస్సు తీశాడు. సరిగ్గా బలగ – రిమ్స్ కూడలికి వచ్చేసరికి వెనుకగా వస్తున్న ఒక ఆటో డ్రైవర్ స్పీడ్ బ్రేకర్ల వద్ద అదుపు చేయలేక బస్సును ఢీకొట్టాడు. ఆటో నుంచి తక్షణమే దిగిన డ్రైవర్ ఎండపల్లి వసంతరావు బస్సు సడన్‌గా బ్రేక్ వేయడం వలనే ఢీకొన్నానని అంటూ ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి దిగాడు. దీంతో ఆర్టీసీ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

రైలు ఢీకొని 37 గొర్రెలు మృతి



రైల్వే ట్రాక్‌పై మృతి చెందిన గొర్రెలు

కంచిలి: మండలంలోని కంచిలి – సోంపేట మార్గం మధ్య రైల్వేట్రాక్‌ను దాటుతుండగా బుధవారం ఉదయం రైలు ఢీకొని 37 గొర్రెలు మృతి చెందాయి. మేతకు వెళ్తున్న క్రమంలో రైలు పట్టాలు దాటుతుండగా అనుకోకుండా ఈ ప్రమాదం చోటుచేసుకొంది. మృతి చెందిన గొర్రెలు బొగాబెణి పంచాయతీ పరిధి జెన్నాగాయి కాలనీకి చెందిన ఇప్పిలి చిన్నారావుకు చెందినవిగా గ్రామస్తులు చెబుతున్నారు. రైలు ప్రమాదంలో గొర్రెలు మృతి చెందడంతో చిన్నారావు కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. తమకు ఏర్పడిన ఈ నష్టంపై ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

22న తపాల అదాలత్

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ పరిధిలో తపాల వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి ఈ నెల 22న తపాల అదాలత్ నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం పోస్టల్ సూపరింటెండెంట్ వి.హరిబాబు బుధవారం తెలిపారు. వినియోగదారులు తమ ఫిర్యాదులను 'తపాల అదాలత్' పేరిట 'సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, శ్రీకాకుళం పోస్టల్ డివిజన్, శ్రీకాకుళం – 532001' చిరునామాకు పంపాలని కోరారు. గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబోమని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజ్ సమీపంలోని సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద 22వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు వ్యక్తిగతంగా సమర్పించి అదాలత్‌కు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ఆర్థిక అవకతవకలకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించబోమని స్పష్టం చేశారు.

కొడుకును భయపెట్టాలని..!



త్రివేణి(ఫైల్)

కొత్తూరు: తాను చెప్పిన మాటలు కుమారుడు వినకపోవడంతో అతడిని భయపెట్టాలని చూసి జుట్టుకు రాసుకునే నూనె తాగి తల్లి త్రివేణి మృతి చెందిన ఘటన కొత్తూరు మండలం గూనభద్ర కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, భర్త చెప్పిన వివరాల మేరకు.. గూనభద్ర కాలనీకి చెందిన త్రివేణి, సత్యనారాయణలు దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అయితే ఒక కుమారుడు తల్లిదండ్రులు చెప్పిన మాటలు వినకపోవడంతో కొడుకును బెదిరించాలన్న ఆలోచనతో తల్లి త్రివేణి ఇంట్లో ఉన్నటువంటి తలకు రాసుకునే నూనె ఈనెల 11వ తేదీన సేవించింది. విషయం తెలుసుకున్న భర్త వెంటనే త్రివేణిని స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లాడు. అక్కడ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో త్రివేణి వైద్యం పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ తెలిపారు. భర్త సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



ధర్నా చేపడుతున్న డ్రైవర్లు

నరసన్నపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకంతో నష్టపోతున్న తమను ఆదుకోవాలని ఆటో, క్యాబ్ మ్యాక్సీ డ్రైవర్లు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో బుధవారం నిరసన చేపట్టారు. డ్రైవర్ల ప్రతినిధి కాల్ల నరసింహం మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం వలన తమ ఆదాయం బాగా పడిపోయిందని, కుటుంబాలను పోషించుకోవడం ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని, నరసన్నపేటలో అన్ని స్టాండ్లకు ప్రత్యేకంగా స్థలాలు కేటాయించాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టేందుకు ప్రయత్నించగా పోలీసులు అనుమతినివ్వకపోవడంతో స్టాండ్ల వద్దే ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆటో, క్యాబ్ మ్యాక్సీ డ్రైవర్ల సంఘం ప్రతినిధులు డి.ఉమ, యు.శ్రీనివాసరావు, జి.వెంకటేష్, డి.రమేష్, కె.చిరంజీవి, కర్రి డిల్లీశ్వరరావు, పి.రాంబాబు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ముందు గిరిజన మహిళల ధర్నా



ధర్నా చేస్తున్న గిరిజన మహిళలు

పాతపట్నం: మండలంలోని బైదలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) ముందు వైద్యం అందడం లేదని గిరిజన మహిళలు ప్లకార్డులతో ధర్నా చేపట్టారు. బుధవారం ఉదయం ఆర్.ఎల్.పురం,పెద్ద సున్నాపురం, రామన్నగూడ తదితర గిరిజన గ్రామాలకు చెందిన మహిళలు పీహెచ్‌సీకి చేరుకున్నారు. ప్లకార్డులు పట్టుకొని తమకు డాక్టర్ వద్దని ఆందోళన చేపట్టారు. వైద్యం కోసం ఆస్పత్రికి వస్తే.. వేరే ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేరే డాక్టర్‌ను నియమించి తమకు సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆటో బోల్తా



బోల్తాపడిన ఆటో

నరసన్నపేట: మండలంలోని దేశవానిపేట సమీపంలో పోలాకి రోడ్డులో చీడివలస నుంచి నరసన్నపేటకు వెళ్తున్న ఆటో బుధవారం ఉదయం బోల్తా పడింది. దీంట్లో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. బాగా గాయపడిన చీడివలసకు చెందిన కాల జ్యోతిని 108లో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఆటో అదుపు తప్పడంతో బోల్తాపడినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

వీధి కుక్కల దాడిలో నలుగురికి గాయాలు

మందస: మండల కేంద్రంలో వీధి కుక్కల దాడిలో నలుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. బుధవారం గుంపుగా వెళ్లి దాడిచేసి ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులకు కాటు వేశాయి. దీంతో వీరికి మందస ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ దాడులు చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నియంత్రణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



ప్రాజెక్ట్ గురించి జేసీకి వివరిస్తున్న విద్యార్థిని

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులు ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు అధ్యక్షతన కళాశాల సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వేదికగా సమాజంలో సైన్స్ వైబ్రేషన్ పేరిట రెండు రోజుల సైన్స్ ప్రయోగాల ప్రదర్శన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. కళాశాల సెంటర్ ఫర్ అప్లయిడ్ సైన్సెస్, జంతుశాస్త్ర విభాగాలు సంయుక్తంగా ఇండిజీనియస్ ఫర్ ప్రొగల్ సైన్స్ ఇన్వెన్షన్ సొసైటీ సౌజన్యంతో ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ప్రశ్నించే తత్వం ఉంటే విషయ పరిజ్ఞానం పెరిగి, అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. అలాగే సైంటిఫిక్ టెంపర్, పరిశోధనా విధానాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ ఇటువంటి సైన్స్ ఎగ్జిబిషన్లతో విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో లైఫ్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ మదమంచి ప్రదీప్, ఎన్‌వైకే డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పోలినాయుడు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్స్ డాక్టర్ రోణంకి హరిత, పి.సుధారాణి, శివాల రవిబాబు, కె.అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు..!

- ఐటీఐలో ఖాళీ సీట్ల భర్తీకి చివరి విడత నోటిఫికేషన్ విడుదల



ఐటీఐ శిక్షణా కేంద్రంలో విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి ప్రభుత్వం ఎట్టకేలకు చర్యలు చేపట్టింది. 2025–26 విద్యా సంవత్సరానికిగాను మిగులు సీట్ల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి చివరి విడత అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానించింది. ఇంకా ప్రవేశాలు పొందని విద్యార్థులు వివిధ ఐటీఐ శిక్షణ కేంద్రాల్లో ఖాళీ సీట్లను సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం డీఎల్‌టీసీ/ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్మోహనరావు సూచించారు. దరఖాస్తులను ఐటీఐ.ఏపీ.జీవోవి.ఇన్ ఆన్‌లైన్ వెబ్‌పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

ఇదీ షెడ్యూల్..

షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడానికి సెప్టెంబర్ 27 రాత్రి 11.50 నిమిషాల వరకు గడువు ఉందన్నారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవడానికి సెప్టెంబర్ 28 మధ్యాహ్నం 2 గంటలతో గడువు ముగుస్తుందన్నారు. అలాగే కౌన్సెలింగ్ నిర్వహణ సెప్టెంబర్ 29వ తేదీన ఉదయం 9 గంటల నుంచి జరుగుతుందని తెలిపారు. శ్రీకాకుళం డీఎల్‌టీసీలో మహిళలకు ప్రత్యేకంగా సూయింగ్ టెక్నాలజీ(టైలరింగ్) కోర్సు అందుబాటులో ఉందని, కొన్ని సీట్లు మిగిలి ఉన్నాయని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 95051 61701, 99639 45259 నంబర్లను సంప్రదించాలని ఏడీ రామ్మోహనరావు కోరారు.

కలప లారీ స్వాధీనం




స్వాధీనం చేసుకున్న కలప లారీ

నరసన్నపేట: మండలంలోని గోపాలపెంట నుంచి ఎచ్చెర్లకు అక్రమంగా లారీలో కలపను తరలిస్తుండగా నరసన్నపేట ఫారెస్టు సిబ్బంది బుధవారం పట్టుకున్నారు. సుమారు రూ.లక్ష విలువ కలిగిన అకేసీ కలపను లారీలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఫారెస్టు సిబ్బంది పట్టుకున్నారు. ఫారెస్టు రేంజి ఆఫీసర్ జగదీష్ మాట్లాడుతూ అక్రమ కలప రవాణా లారీపై కేసు నమోదు చేసి వివరాలు డీఎఫ్‌వోకు తెలియజేశామని, పరిశీలించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఆటో డ్రైవర్ల నరకయాతన

- ఫిట్‌నెస్ సెంటర్ వద్ద ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు పడిగాపులు
- బారులుతీరిన వందలాది వాహనాలు
- కమీషన్ చెల్లించిన వారికే అనుమతిస్తూ సిబ్బంది జులుం
- వాగ్వాదానికి దిగిన డ్రైవర్లు



బారులుతీరిన ఆటోలు

శ్రీకాకుళం రూరల్:

జిల్లా కేంద్రంలోని కిమ్స్ ఆస్పత్రి సమీపంలో వ్యవసాయ కేంద్రానికి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన ఫిట్‌నెస్ సెంటర్ ఆటోడ్రైవర్లకు చుక్కలు చూపిస్తోంది. గవర్నమెంట్ అప్రూవ్డ్ ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్ పేరిట ఏర్పాటు చేసిన ఈ కేంద్రం వద్ద బుధవారం ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు వందలాది ఆటోలు బారులు తీరాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వాహన మిత్ర పథకం మంజూరు చేస్తామని, ఆటో డ్రైవర్లకు రూ. 15000 నగదు జమ చేస్తామని ప్రకటించడం.. చివరి తేదీ సమీపించడంతో జిల్లా నలుమూలల నుంచి వందలకొద్దీ ఆటోలు కేంద్రం వద్ద క్యూకట్టాయి.

కమీషన్ చెల్లిస్తే అనుమతి..

ఫిట్‌నెస్ సెంటర్ సిబ్బందికి కమీషన్ ఇచ్చిన వారికి మాత్రమే లోపలికి అనుమతిస్తున్నారు. అటువంటి ఆటోకు మాత్రమే టెస్టింగ్ చేసి బయటకు పంపిస్తున్నారు. ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో ఆటోడ్రైవర్లు నిరసనకు దిగారు. టెస్టింగ్ సెంటర్ సిబ్బందిపై తిరగబడ్డారు. కమీషన్ ఇచ్చే పరిస్థితి లేదని, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వకపోతే పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని వాగ్వాదానికి దిగారు. దీంతో చేసేదేమీ లేక ఫిట్‌నెస్ చేసిన ఆటోలను ఒకసారిగా బయటకు పంపించారు.

ఉదయం నుంచి వేచి ఉన్నా



నా ఆటో ఫిట్‌నెస్ కోసం ఉదయం నుంచి టెస్టింగ్ సెంటర్ వద్ద వేచి ఉన్నాను. కనీసం తాగడానికి మంచి నీరు కూడా లేదు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం రూ.2000 అదనంగా సిబ్బందికి చెల్లించాను. అయినప్పటికీ నా ఆటోను లోపలి నుంచి బయటకు అనుమతించలేదు.

– తఫ్రీద్, పలాస



ఫిట్‌నెస్ సెంటర్ సిబ్బందితో ఆటోడ్రైవర్ల వాగ్వాదం



పడిగాపులు కాస్తున్న ఆటో డ్రైవర్లు

గంజాయితో ఇద్దరు యువకులు అరెస్టు



మాట్లాడుతున్న సీఐ మీసాల చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని ఎల్‌సీ గేట్ వద్ద 11 కేజీల గంజాయితో ఇద్దరు యువకులను మంగళవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నామని సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఈ మేరకు సీఐ కార్యాలయం ఆవరణలో పత్రికా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే ఎల్‌సీగేట్ సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. తమిళనాడుకి చెందిన కదాశిమ ముత్తుకుమార్, కపిల్‌దేవ్ మరియప్పన్ 11.120 కేజీల గంజాయితో పట్టుబడినట్లు తెలిపారు. తమిళనాడు రాష్ట్రం తుత్తుకొడి పట్టణానికి చెందిన వీరిద్దరూ.. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగులేకపోవడంతో గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఒడిశాకి చెందిన గంజాయి వ్యాపారి మణిక్ సబర్ వద్ద తక్కువ రేటుకి గంజాయిని కొనుగోలు చేశారు. అనంతరం ఒడిశా నుంచి బస్సు ద్వారా ఇచ్ఛాపురం చేరుకున్నారు. అక్కడ నుంచి రైలు మార్గం ద్వారా తమిళనాడుకి వెళ్లేందుకు గంజాయిని తీసుకెళ్తుండగా ఎల్‌సీగేట్ వద్ద రూరల్ పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.